క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతున్న అధ్యాపకులు

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవల్లి తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కళాశాల అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్లు చేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు అవకాశం ఉందన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు అధునాతన వసతులతో కూడిన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సబ్సిడీ కందులు సద్వినియోగం చేసుకోండి

కూడేరు: మండల రైతులు సబ్సిడీ కందులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయ కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు ఎల్ఆర్‌జీ-52 రకం కందులు 50 క్వింటాళ్లు చేరినట్లు ఏఓ తెలిపారు. ఒక బ్యాగులో 4 కేజీల కందులు ఉంటాయని, సబ్సిడీ పోనూ రైతు రూ.392 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తన కందులు కావాల్సిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సూచించారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామి శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాయదుర్గం ప్రాంత పరిసరాల్లో శనీశ్వరాలయం ఒక్కటే ఉండడం విశేషం.

విశ్రాంత ఉద్యోగుల సంఘానికి విరాళం

కళ్యాణదుర్గం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘానికి విశ్రాంత ఎంపీహెచ్ఈఓ వెంకటేశులు విరాళం తన వంతుగా రూ.10,116 మొత్తాన్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామికి శనివారం అందించారు.

వజ్రకరూరు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

ఉరవకొండ: వజ్రకరూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న కె.సుధీర్ నరసింహారెడ్డి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా డివిజనల్ సహాయ అధికారి (అనంతపురం)కి సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాసూక్త పారాయణం



యల్లమ్మ దేవతకు పూజలు చేస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని జీసెస్ నగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ తల్లి విశేష పూజలందుకుంటోంది. మూడు రోజులుగా సాగుతున్న ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 108 దుర్గాసూక్తములతో అమ్మవారిని భక్తులు ఆరాధించారు. లలిత సహస్రనామాలతో ఆలయం మార్మోగింది. అలాగే యల్లమ్మ తల్లికి అభిషేకం, చండీ, రుద్ర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు అమ్మవారికి నీరాజనాలర్పించారు. ఆదివారం ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా 108 శ్రీసూక్తములతో అభిషేకం, మహాపూర్ణాహుతి, మహా అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతాయి. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నాసిరకం నారు..కొంటే కన్నీరు



ఈ రైతు పేరు సుధాకర్‌రెడ్డి. గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామం. గతేడాది రాయదుర్గం పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఓ నర్సరీ నుంచి మిరప నారు ఒక్కో మొక్క రూ.1.50తో 70 వేల మొక్కలు కొనుగోలు చేశాడు. అందుకు రూ.1.05 లక్షలు వెచ్చించాడు. పెట్టుబడుల కోసం రూ.లక్షలు ఖర్చుచేసి కోటి ఆశలతో పంట సాగుచేశాడు. నారు నాసిరకం కావడంతో ఎదుగుదల లేక, నష్టపోవాల్సి వచ్చింది. పంటకు తెగుళ్లు సోకి ఎండిపోయింది. మొక్క కొనుగోలు సమయంలో రశీదు పొంది ఉంటే కొంత వరకైనా నష్ట పరిహారం వచ్చేది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు వాల్మీకి గోవిందు. గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామం. ఇతను 5 ఎకరాల్లో మిరప పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ నర్సరీలో మొక్కలు కొనుగోలు చేసి, నాటాడు. మొక్కలు ఏపుగా పెరిగిన కాత మాత్రం సక్రమంగా రాలేదు. దీంతో రూ.లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది.

- మిరప సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నాసిరకం నారుతో జాగ్రత్త అంటున్న అధికారులు
- బ్యాడిగి మిర్చి సాగుపై రైతుల ఆసక్తి
- రశీదులు ఇస్తేనే కొనాలని సూచన

రాయదుర్గం:
రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో ఈ ఏడాది మిరప సాగు చేపట్టే అవకాశం ఉందని అధికారుల ప్రాథమిక అంచనా. గతేడాదితో పోలిస్తే 10 నుంచి 20 వేల ఎకరాలు అదనంగా సాగయ్యే అవకాశం ఉందని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఎర్ర బంగారం (ఎండు మిర్చి) ధరలకు ఏటేటా రెక్కలొస్తున్నాయి. నాణ్యత ఆధారంగా మార్కెట్లో క్వింటా రూ.60 వేల నుంచి రూ.70 వేలు దాటుతుండడంతో అన్నదాతలు బ్యాడిగి రకం మిర్చి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గతేడాది ప్రకృతి విపత్తులతో పంట మొత్తం తెగుళ్ల బారిన పడి, తుడిచి పెట్టుకుపోయింది. ఈ సారి మార్కెట్లో ధర కాస్త ఊరిస్తుండడంతో ఆ లోటు భర్తీ చేసుకునేలా రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. గతేడాదికంటే ఈ సారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. విత్తనం మొదలు పురుగు మందులు, కలుపు, గుంటుక ఇలా మిరప పంట చేతికొచ్చే వరకూ రూ.లక్షలు పెట్టుబడి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఏ రకం అడిగినా అదేనంటూ మోసం

రైతులు కొందరు వారికి నచ్చిన మిరప విత్తనం కొని పొలాలు, లేదా నర్సరీల్లో నారు పెంపకం చేపడతారు. అలాంటివారికి నకిలీ నారు బెడద తప్పినట్టే. అయితే మరికొందరు విత్తనాల కోసం రూ.లక్షలు ఖర్చుచేసి, పెంపకం చేపట్టే స్తోమత లేని రైతులు నర్సరీ యజమానులను ఆశ్రయిస్తున్నారు. వారి ద్వారా కొనుగోలు చేసిన నారు నాటుకుంటున్నారు. దీంతో నర్సరీ యజమానులు పరిస్థితిని అనుకూలంగా మార్చుకుంటున్నారు. రైతు వెళ్లి ఏ రకం నారు అడిగినా.. ఇదేనంటూ కొందరు వ్యాపారులు అంటగట్టేస్తున్నారు. ఏటా జరుగుతున్న ఈ మోసాలకు ప్రభుత్వం విత్తన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి కట్టడి చేసింది. హార్టికల్చర్ అధికారులు నారు పెంపకం, కొనుగోలుపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నారు ఏది కొన్నా తప్పక రసీదు పొందాలని అవగాహన కల్పిస్తున్నారు.



నర్సరీలో పెరుగుతున్న మిరప నారు

నాణ్యత ముసుగులో దోపిడీ

కర్ణాటక, మహారాష్ట్ర మిరప విత్తన శుద్ధి పరిశ్రమలు ఉన్నాయి. అక్కడి నుంచి ప్యాకెట్లలో వచ్చిన విత్తనాలు కిలో రూ.70 నుంచి రూ.1.20 లక్ష దాకా ధర ఉంటుంది. వాటి స్థానంలో కొందరు అక్రమార్కులు నకిలీ ప్యాకెట్లు సృష్టించి, నర్సరీల్లో నారు పెంపకం చేపడుతున్నట్టు తెలుస్తోంది. తక్కువ ధర..ఎక్కువ దిగుబడి పేరుతో రైతును దగా చేసి రసీదు ఇవ్వకుండానే నారు అంటగట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాటిన నారు ఎదుగుదల, దిగుబడి లోపాలను గుర్తించాక మోసపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

నారుకొంటే రసీదు తప్పనిసరి

మార్కెట్లో రకరకాల విత్తనాలు వస్తున్నాయి. రైతులు అవగాహన లేకుండా ఎక్కడపడితే అక్కడ నారు కొనుగోలు చేయడం మంచిది కాదు. నర్సరీల్లో పెంచిన నారును నమ్మకస్తులతోనే కొనాలి. ముఖ్యంగా మిరపతో పాటు ఇతర ఏ రకం మొక్క తీసుకోవాలన్నా విత్తన చట్టం ప్రకారం తప్పక రసీదు పొందాలి. అప్పుడే ఏ లోపం కలిగిన పరిహారం తీసుకునే అవకాశం ఉంటుంది.

– మౌనిక, హార్టికల్చర్ అధికారి, రాయదుర్గం

కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు

రాయదుర్గం(డి హీరేహాళ్): బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన ఎం.శ్రీధర్ అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శనివారం తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు వివరాలను ఎస్ఐ వెల్లడించారు. డీహీరేహాళ్ మండలం హెచ్.సిద్ధాపురానికి చెందిన సువర్ణతో ఎం.శ్రీధర్‌కు గతేడాది వివాహమైంది. అప్పట్లో కట్న కానుకల కింద రూ.2.50 లక్షల నగదు, 10 తులాల బంగారం ఇచ్చారు. కొన్నాళ్లపాటు దాంపత్యం అన్యోన్యంగా సాగింది. సువర్ణను భర్త శ్రీధర్‌తోపాటు అత్త, మామ, బావ అదనపు కట్నం మరో రూ.2.50 లక్షల తీసుకురావాలని ఒత్తిడి తేవాలని, లేకపోతే విడాకులు ఇస్తామని బెదిరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో కనగానపల్లి రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కనగానపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఒక యువకుడు వేగంగా వస్తున్నాడు. మామిళ్లపల్లి గ్రామానికి సమీపంలోకి రాగానే నర్సరీల వద్ద రోడ్డు పక్కన నిలిపిన మరో ద్విచక్ర వాహనంతో పాటు పక్కనే నిలబడి ఉన్న శోభా అనే మహిళను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శోభ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జగనన్నను కలిసిన విశ్వేశ్వరరెడ్డి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు పార్టీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న శనివారం కలిశారు. కౌంటింగ్ అనంతరం ఉరవకొండ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణపై అధినేతతో విశ్వేశ్వరరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

ఆంజనేయుడికి కుంభాభిషేకాలు



కూడేరులో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



విశేష పూజలందుకున్న సీతారామస్వామి సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని పాలికిలో వెలసిన సీతారామస్వామి సమేత ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం, సుందరకాండ యాగం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సీతారామస్వామి సమేత ఆంజనేయస్వామి మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, పారాయణ హోమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ట, ప్రత్యేక హోమాలు ఏర్పాటు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడు సీతారామ పట్టాభిషేకం..

ఉత్సవాల్లో భాగంగా సీతారామ స్వామి ఆలయంలో ఆదివారం సీతారామ మహా పట్టాభిషేక మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరుగుతుందని సీతారామ హనుమద్ భక్త మండలి సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కూడేరు: మండలంలోని రామదుర్గం, బసాపురం, కూడేరులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తొలుత ఆంజనేయ స్వామి మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. తర్వాత స్వామిని వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బసాపురం, రామదుర్గం ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

అస్తవ్యస్తంగా సర్జికల్ వార్డు



ఎంఎస్-1, 2లోకి వచ్చిన వర్షపు నీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికురాలు



సర్జికల్ వార్డులో పాత అల్మారా, అడ్డుగా వేసిన మంచాలు

- వార్డుల్లోకి చేరుతున్న వర్షపు నీరు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగానికి సంబంధించి ఎఫ్ఎస్-1, 2 వార్డుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. వార్డులోకే నీరు రావడంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు వెంటనే స్పందించారు. వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. కాగా సర్జికల్ విభాగంలోని వివిధ విభాగాల్లో సురక్షిత ప్రమాణాలు పాటించాల్సి ఉంది. వార్డు ఆరు బయటే పాత మంచాలు, అల్మార్లు ఉంచేస్తున్నారు. తద్వారా రోగులకు అసౌకర్యం కల్గుతోంది. సర్జికల్ వార్డులో ఎప్పటికప్పుడు సురక్షిత ప్రమాణాలు పాటిస్తేనే.. రోగులకు ఇన్‌ఫెక్షన్ శాతం తగ్గే అవకాశం ఉంటుంది. ఆ దిశగా సర్వజనాస్పత్రి ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



నాయకులతో సమావేశమైన తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తనను కలవాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కళ్యాణదుర్గం అర్బన్, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండల నాయకులతో ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఫలితాలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నేరుగా ఇంటింటికీ అందించినా ఓటర్లు ఎందుకు మొగ్గు చూపలేదన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు నాయకులు అండగా నిలవాలన్నారు. తాను ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోయ తిప్పేస్వామి, గోపారం శ్రీనివాసులు, అడ్వొకేట్ హనుమంతరెడ్డి, యర్రంపల్లి కృష్ణమూర్తి, కిరీటి యాదవ్, నాగరాజు, హరినాథ్ రెడ్డి, శ్యాంసుందర్ చౌదరి, జాకీర్, రాజు, పలువురు పాల్గొన్నారు.

లక్ష్మయ్య కుటుంబానికి రంగయ్య పరామర్శ

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలక గుండెపోటుతో మృతి చెందిన చెర్లోపల్లి లక్ష్మయ్య కుటుంబాన్ని మాజీ ఎంపీ తలారి రంగయ్య శనివారం పరామర్శించారు. గ్రామానికి వెళ్లి లక్ష్మయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండదండలు, నా సహాయ సహకారాలు నిరంతరం ఉంటాయని భరోసా కల్పించారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. జగనన్న అన్నివర్గాలకూ మేలు చేశారని, తమకు జగనన్న తోడుగా ఉన్నాడన్న భరోసాతో ఇన్నాళ్లూ పేదలు, మధ్య తరగతి ప్రజలు ధైర్యంగా జీవించారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మాజీ ఎంపీటీసీ గంగప్ప, సర్పంచ్ విరుపాక్షి, గంగాధర, నాయకులు సోమనాథ రెడ్డి, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, ఆనందప్ప, ఖాసిం, మహాదేవ, మాలింగ, రామాంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, మంజునాథ రెడ్డి, ప్రతాప్, వెంకటేశులు, నాగభూషణ, తిప్పేస్వామి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



చెర్లోపల్లిలో లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

పాడి పరిశ్రమతోనే ఆర్థిక ప్రగతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పాడి పరిశ్రమతోనే ఆర్థిక ప్రగతి సాధ్యం. రైతులు పాడి ఆవులను పెంచుకుని పాల విక్రయాలతో అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. శనివారం తాలూకాలోని సీకే పురం గ్రామంలో నూతన పాల సేకరణ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి పరిశ్రమకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత గ్యారంటీ పథకాలను తుచ తప్పకుండా అందిస్తున్నా ప్రజలు మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడం శోచనీయమన్నారు. పక్కనున్న ఆంధ్ర రాష్ట్రంలో ఉచితాలను క్రమం తప్పకుండా ప్రతి ఏటా అందిస్తున్నా కూడా వైఎస్ జగన్‌ను 11 స్థానాలకే పరిమితం చేయడం ఆశ్చర్యకరమన్నారు. ప్రజల మనోభావాలను అంచనా వేయడం కష్టమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనంద రావ్, కేపీసీసీ సభ్యుడు కోటి ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరరెడ్డి, బిందు మాధవ్, పాల ఉత్పత్తి సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

వంకల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



నడిమివంకను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నడిమివంక, మరువవంకల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కోర్టు రోడ్డులో ఉన్న గుల్జార్‌పేటలో జరుగుతున్న ఫాగింగ్ పనులు, కృష్ణ ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న మరువవంక, సోమనాథ్ నగర్‌లోని నడిమివంక, తపోవనం వద్ద ఉన్న బైపాస్‌లోని కాలువను కలెక్టర్ పరిశీలించారు. వర్షం వచ్చినా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, పబ్లిక్ హెల్త్ డీఎస్ఈ రామమోహన్ రెడ్డి, నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, డీఈలు సుభాష్, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధ్యాత్మికత, జ్ఞానాన్ని బోధించాం



మాట్లాడుతున్న గుత్తి సీఎస్ఐ డివిజనల్ సెక్రటరీ డేవిడ్ నాయక్

గుత్తి: వెకేషనల్ బైబిల్ స్కూల్(వీబీఎస్) విద్యార్థులకు ఆధ్యాత్మికతతోపాటు జ్ఞానాన్ని బోధించామని గుత్తి సీఎస్ఐ చర్చి డివిజనల్ సెక్రెటరీ పాస్టర్ రెవరెండ్ డేవిడ్ నాయక్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న వీబీఎస్ కార్యక్రమం శనివారం ముగిసింది. వీబీఎస్ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చర్చి కార్యదర్శి చార్లెస్, కోశాధికారి ప్రసాద్ రావు, సూపరింటెండెంట్ శోభా, ఉమన్ సెల్ సెక్రెటరీ రాజామణి, వీబీఎస్ విద్యార్థులు, చర్చి సిబ్బంది , వీబీఎస్ బోధకులు పాల్గొన్నారు.

పామిడి: పామిడిలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహిస్తున్న విరామ బైబిల్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్, పాస్టరమ్మ సువర్ణమ్మ, సండేస్కూల్ టీచర్ ఎస్ ప్రిస్కిల్లా రత్నరాజు, బైబిల్ టీచర్లు ఏసుకాంత్, డేవిడ్ ప్రిన్స్ సారథ్యంలో నెహ్రూనగర్ పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యేసుక్రీస్తు జీవిత చరిత్రపై భక్తిగేయాలు ఆలపించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

నేలకొరిగిన చెట్టు



దేవగిరి క్రాస్‌వద్ద నేలకొరిగిన చెట్టు

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద బళ్లారి-కళ్యాణదుర్గం అంతర్‌రాష్ట్ర రహదారిపై భారీ రావి వృక్షం నేలకొరిగింది. గాలీవానకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విరిగిపడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రావిచెట్టు వేర్లతో సహా రోడ్డుపై పడింది. దీంతో కళ్యాణదుర్గం-బళ్లారి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టును తొలగించే ప్రయత్నం ఎవరూ చేయకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు తొలగింపజేశారు.

నేడు మహిళా సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం సెంట్రల్: నగరంలో రాణినగర్‌లో ఉన్న బహామీ బైతుల్ మాల్ షాదీ మహల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మహిళల సున్నీ ఇజ్‌తెమా నిర్వహిస్తున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.